నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
18వ
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం,18 డిసెంబర్ 2024

వ్యవసాయ రంగానికి రూ.43 వేల 42 కోట్లు కేటాయించిన ఘనత కూటమి ప్రభుత్వానిదే

- నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం పట్ల మంత్రి సుభాష్ హర్షం

రామచంద్రపురం, మేజర్ న్యూస్ : దేశానికి అన్నం పెట్టే అన్నదాతను ఆదుకునేందుకు అనుగుణంగా వ్యవసాయ రంగానికి బడ్జెట్లో 43 వేల 42 కోట్లు కేటాయించిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రివాసంశెట్టి సుభాష్ అన్నారు. మంగళవారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామచంద్రపురం నియోజవర్గ పరిధిలో ఉన్న 18 నీటి సంఘాలు, 4 డిస్ట్రిబ్యూటరీ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికల్లో ఉమ్మడి కూటమి రైతులు ఏకగ్రీవం కావడం శుభ పరిణామం అని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తూ, పంట రైతుల నుంచి కొనుగోలు చేసిన 24 గంటలలోపే వారి అకౌంట్లో నిధులు జమ చేస్తున్నామన్నారు. గత వైసిపి పాలనలో రైతుల సమస్యలను గాలికి వదిలేసారని మంత్రి సుభాష్ విమర్శించారు. అన్నదాతను అన్ని విధాలా ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత నిస్తూ బడ్జెట్లో 43 వేల 42 కోట్ల రూపాయలు కేటాయించడం రైతుల పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అని పేర్కొన్నారు. రైతాంగానికి మేలుచేసే నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు కృషి చేసిన రైతాంగానికి, కూటమి నాయకులందరికీ, ఎన్నికైన అధ్యక్షులు, ఉపాధ్యక్షులకు మంత్రి సుభాష్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

పిడిఎస్ బియ్యం ఎగుమతిని నిరోధిస్తాం

- పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్ షణ్మోహన్
- 137 రైస్ మిల్లులపై కేసులు
- సెల్లా ఎల్ నౌకలో 1320 టన్నుల పిడిఎస్ బియ్యం గుర్తింపు
- నౌక నుంచి పిడిఎఫ్ బియ్యం అన్లోడ్ చేసి యాంకర్స్‌పోర్ట్‌లో సీజ్

ఉమ్మడిగోదావరిజిల్లాల సూర్యబ్యూరో : కాకినాడ యాంకరేజి పోర్టులోని స్టెల్లా ఎల్ నౌకలో 1320 టన్నుల పిడియస్ బియ్యం ఉన్నట్లుగా మల్టీ డిసిప్లినరీ టీమ్ తనిఖీలో నిర్ధారణ అయిందని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలియజేశారు.మంగళవారం మద్యాహ్నం కలెక్టరేట్ వివేకానంద హాలులో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి... జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాలతో కలిసి మీడియా ప్రతినిధలతో కలిసి ప్రెస్ మీట్ నిర్వహించి పిడియస్ బియ్యం అక్రమ ఎగుమతుల నిరోధ చర్యలపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ గత నెల 29వ తేదీన యాంకరేజి పోర్టులో ఎగుమతి కొరకు లోడ్ చేసిన స్టెల్లా ఎల్ నౌకలో తాను జరిపిన తనిఖీలో 640 టన్నులు రేషన్ బియ్యం గుర్తించిన నేపద్యంలో, నౌకలోని మొత్తం బియ్యాన్ని తనఖీ చేసేందుకు ఏర్పాటు చేసిన 5 శాఖల అధికారులతో కూడిన మల్టీ డిసిప్లినరీ టీమ్ ఏర్పాటు చేసామన్నారు. ఈ టీమ్ స్టెల్లా ఎల్ నౌకలోని మొత్తం 4 వేల టన్నుల బియ్యాన్ని 12 గంటల పాటు తనిఖీ చేసి నమూనాలు సేకరించిందని, ఈ నమూనాలా లాబ్ పరీక్షలలో నౌకలోని 3వ కంపార్టుమెంట్‌లో ముందు గుర్తించిన 640 టన్నుల పిడియస్ బియ్యంతో పాటు మరో 680 టన్నులు పిడియస్ బియ్యం ఉన్నట్లు నిర్ధారణ అయిందని తెలిపారు. ఈ బియ్యం సత్యం బాలాజీ రైస్ ఎక్స్‌పోర్ట్ ఇండస్ట్రీస్ సంస్థకు చెందినదిగా గుర్తించడం జరిగిందని, ఈ బియ్యాన్ని సదరు సంస్థ ఎక్కడ నుండి, ఎవరి నుండి తెచ్చి ఎగుమతి చేస్తున్నారో విచారణ చేస్తున్నామని ఆయన తెలియజేశారు. స్టెల్లా ఎల్ నౌకలో గుర్తించిన 1320 టన్నుల పిడియస్ బియ్యాన్ని నౌక నుండి అన్‌లోడ్ చేయించి యాంకరేజి పోర్టు సీజ్ చేస్తుందన్నారు. పిడియస్ బియ్యం అన్‌లోడింగ్‌కు 24 నుండి 48 గంటలు సమయం పడుతుందని, అన్‌లోడింగ్ అనంతరం సక్రమంగా ఎగుమతి చేస్తున్న 12 వేల టన్నుల బియ్యాన్ని నౌకలో లోడింగ్‌కు అనుమతిస్తామన్నారు. స్టేల్లా ఎల్ నౌకను రిలీజ్ చేసే అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని, ఎపుడు రీలీచ్ చేసేది మరల తెలియజేస్తామని ఆయన తెలిపారు. పేదల కొరకు నిర్దేశించిన బియ్యం అక్రమ తరలింపును పూర్తిగా అరికడతామని, జిల్లాలో ఏ గొడౌను, రైసుమిల్లు, ట్రేడర్ వద్దగాని, ఆటో నుండి షిప్పు వరకూ ఏక్కడ ఉన్న సీజ్ చేసి అక్రమాలకు పాల్పడినవారిపై కఠిన చర్యలు చేపడతామన్నారు. కాకినాడ యాంకరేజి పోర్టు నుండి గాని, డీప్ వాటర్ పోర్ట్ నుండి గాని ఒక్క గ్రాము పిడియస్ బియ్యం కూడా దేశం దాటి బయటికి వెళ్లకుండా నిరోధిస్తామని కలెక్టర్ తెలిపారు. అలాగే నిజాయితీగా వ్యాపార కార్య కలాపాలు జరిపే ఎగుమతిదారులకు, బార్జి వర్కర్లకు ఎటువంటి సమస్య లేకుండా చూస్తామన్నారు. స్టెల్లా ఎల్ నౌక ఉదంతం వల్ల యాంకరేజి పోర్టు నుండి ఎగుమతి కార్యకలాపాలకు ఎటువంటి ఆటంకం, నష్టం కలుగలేదని, ప్రస్తుతం 11 నౌకలు ఈ పోర్టులో ఎగుమతులకు సిద్దంగా ఉన్నాయన్నారు. అలాగే యాంకరేజి పోర్టు ఎగుమతి సామర్థ్యం పూర్తిగా వినియోగించుకున్నాకే, బియ్యం ఎగుమతులను డీప్‌వాటర్ పోర్టు ద్వారా అనుమతించడం జరుగుతుందన్నారు.జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ గత జూన్, జూలై నుండి బియ్యం రవాణాకు సంబంధించి 13 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి మొత్తం 137 రైసు మిల్లులపై కేసులు నమోదు చేయగా, వీటిలో 89 మిల్లులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానివి, మిగిలినవి తెలంగాణా, జార్ఖండ్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలవని తలిపారు. ఇప్పటివరకూ 75మిల్లులను విజిట్ చేసి వాటి రిజిష్టర్లను పరిశీలించడం జరిగిందన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించాలి

రంపచోడవరం, మేజర్ న్యూస్ : రంపచోడవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 17, 18 తేదీలలో రెండు రోజులపాటు అన్ని గ్రామ సచివాలయాల సిబ్బంది, గ్రామ స్థాయి అధికారులు, సర్పంచులు మండల స్థాయి అధికారులతో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించుటకు గాను మండల పరిషత్ అభివృద్ధి అధికారి సుండం శ్రీనివాసు దొర ఆధ్వర్యంలో శిక్షణాతరగతులు ఏర్పాటు చేసారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఐక్యరాజ్యసమితి రూపొందించిన 1.పేదరికం లేని మెరుగైన జీవనోపాధులు కలిగిన గ్రామం 2. ఆరోగ్య వంతమైన గ్రామం 3.బాలహిత గ్రామం 4.నీరు సమృద్ధిగా గల గ్రామం 5. పరిశుభ్రత, హరిత గ్రామం 6.స్వయం సమృద్ధి మౌలిక సదుపాయాలతో కూడిన గ్రామం 7.సామాజికంగా న్యాయమైన మరియు సామాజికంగా సురక్షితమైన గ్రామం 8.సుపరిపాలనా కలిగిన గ్రామం 9.మహిళహిత గ్రామం మొత్తం తొమ్మిది నిర్దేశికాలు ఆయా గ్రామాలలో అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయము తోటి పరిపూర్ణముగా అమలు పరిచినచో ఆయా గ్రామాలు పూర్తి స్థాయిలో అభివృద్ధి సాదిస్తాయని సదరు శిక్షణ కార్యక్రమము నందు తెలియపర్చుచు 2024-2025 ఆర్థిక సంవత్సరములో ఆయా గ్రామ పంచాయితీల ప్రణాలికలు ఉండాలని గ్రామ స్థాయి వివిధ ప్రభుత్వ శాఖ సహాయకులకు దిశానిర్దేశం చేయడం జరిగినది. ఈ శిక్షణ తరగతులకు మండల పరిషత్ అధ్యక్షురాలు బందం శ్రీదేవి, జడ్.పి.టి.సి సభ్యురాలు పండా వెంకటలక్ష్మి, డి.ఎల్.డి.ఓ కోటేశ్వరరావు మరియు పంచాయితీ రాజ్ శిక్షణ కేంద్రం సామర్లకోట నుండి నిహారిక మరియు మండల పరిషత్ పరిషత్ అభివృద్ధి అధికారి సుండం శ్రీనివాసుదొర, పంచాయితీ విస్తారణాధికారిణి పద్మజ మరియు మండల పరిషత్ సిబ్బంది మాస్టర్ ట్రైనర్స్ షేక్ భాషా మరియు మహేశ్వరరావు పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల డిప్యూటేషన్లు రద్దు చేయాలి

- ఐటీడీఏ ను ముట్టడించిన ఉపాధ్యాయులు

రంపచోడవరం, మేజర్ న్యూస్ : ఉపాధ్యాయుల అంతర్ జిల్లాల డిప్యూటేషన్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయులు రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయాన్ని మంగళవారం ముట్టడించారు. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిఆర్టీ లను అంతర్ జిల్లాల డిప్యూటేషన్ పేరుతో 230 మందిని డిప్యూటేషన్ వేశారని, వారి డిప్యూటేషన్లు వెంటనే రద్దు చేయాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఐటీడీఏ కార్యాలయాన్ని ముట్టడి చేశారు. సుమారు ఐదు గంటలపాటు ఐటీడీఏ కార్యాలయం ఎదుట బైఠాయించి, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ యూటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఉపాధ్యాయుల అక్రమ డిప్యూటేషన్ లు రద్దు చెయ్యాలని, ఎక్కడో ఉపాధ్యాయులు లోటు ఉందని ఏజెన్సీ ప్రాంతంలోని సిఆర్టీలను సుదూర ప్రాంతాలకు బదిలీ చేయడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇక్కడ ఒకపక్క 10వ తరగతి పరీక్షలు సమీపిస్తున్నాయని, ఇక్కడి విద్యార్థులకు అన్యాయం చేసి ఇలా చేయడం న్యాయం కాదన్నారు. రంపచోడవరం ఐ.టి.డి.ఏ ఎదుట సిఆర్టీలు చేస్తున్న నిరసనకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మద్దతు తెలిపారు. వీరి సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టిలో పెడతామన్నారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతారామారావు, యూటీఎఫ్ నాయకులు విల్సన్ బాబు, కారం సూరిబాబు,సనాతనబాబు,వెంగళరావు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గల్ఫ్ బాధితురాలికి మంత్రి సుభాష్ అండ

- వీడియో సందేశం ద్వారా మంత్రికి విన్నవించిన బాధితురాలు
- క్షేమంగా ఇండియా రప్పించిన మంత్రి సుభాష్
- మంత్రి సుభాష్‌కు రుణపడి ఉంటామన్న బాధిత కుటుంబం

రామచంద్రపురం, మేజర్ న్యూస్ : 'అయ్యా మంత్రి గారు ఏజెంట్లు చెప్పిన మాయ మాటలు నమ్మి మోసపోయాను.. చిన్న ఇంట్లో పని అని చెప్పి నాలుగు అంతస్తుల భవనంలో వెట్టి చాకిరీ చేయిస్తూ చిత్ర హింసలు పెడుతున్నారు.. కడుపునిండా తిండి కూడా పెట్టట్లేదు.. గుండెలో నొప్పి.. ముక్కు చెవుల ద్వారా రక్తం పడుతుంది.. ఎలాగైనా ఆదుకొని నా కుటుంబంతో చేర్చండి' అంటూ..వీడియో మెసేజ్ పెట్టిన గంటా దీప్తి అనే మహిళకు రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కొండంత అండగా నిలిచారు. గల్ఫ్‌లో పనిచేస్తున్న ఆ మహిళకు వెట్టిచాకిరి నుంచి విముక్తి కలిగించి, ఇండియాకు రప్పించి తన కుటుంబ సభ్యులకు అప్పగించి తన మానవత్వం చాటుకున్నారు మంత్రి సుభాష్. ఈ సందర్భంగా గల్ఫ్ బాధితురాలు గంటా దీప్తి, తన భర్త త్రిమూర్తు, కుటుంబ సభ్యులతో మంగళవారం మంత్రి సుభాష్ ను రామచంద్రపురంలో మర్యాదపూర్వంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మీడియాతో మాట్లాడుతూ దీప్తి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉండడం, భర్తకు హృదయ సంబంధిత రోగం, కన్నబిడ్డల అనారోగ్యం కారణంగా పొట్టకూటి కోసం గత అక్టోబర్ నెలలో బెహరాన్ దేశం వెళ్ళింది అని తెలిపారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటి పల్లి మండలం అంతర్వేది కరా గ్రామానికి చెందిన గంటా దీప్తి కుటుంబ పోషణ నిమిత్తం కేతా శ్రీనివాస్ అనే ఏజెంట్ ద్వారా పని కోసం బెహరాన్ దేశం వెళ్ళింది. అక్కడ రాజబాబు, హసీనా అనే ఏజెంట్లు ద్వారా ఒక ఇంట్లో పని నిమిత్తం గత అక్టోబర్ 24న వెళ్లగా అక్కడ బారెడు వెట్టి చాకిరీ చేయిస్తూ, తిండి పెట్టకుండా చిత్రహింసలకు గురిచేస్తున్నారని మంత్రి సుభాష్‌కు సెల్ఫీ వీడియో ద్వారా తన గోడు వెల్ల బుచ్చుకున్నారు. దీప్తి వీడియో సందేశాన్ని చూసి చలించిన మంత్రి సుభాష్.. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, మరియు ఏపీ నాన్ రెసిడెన్షియల్ తెలుగు సొసైటీ, బెహరన్ లో ఉన్న శివకుమార్ వారి సహకారంతో సౌదీలోని ఇండియన్ ఎంబసీ అధికారులుతో మాట్లాడి గంటా దీప్తిను ఆ ఇంటి నుండి విడిపించి స్వగ్రామానికి క్షేమంగా తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ఏజెంట్ల మాయమాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. ఇటీవల కాలంలో ఏజెంట్ల చేతిలో మోసపోయి కత్తర్, బెహరాన్, దుబాయ్, సౌదీ దేశాలలో చాలామంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు పలు ప్రసారమాధ్యమాల్లో చూస్తున్నామన్నారు. గల్ఫ్ పేరుతో బాధితులను మోసం చేసిన ఏజెంట్లపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంటా దీప్తిను బహరాన్ పంపించిన ఏజెంట్ కేతా శ్రీనివాస్‌పై సఖినేటిపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశామని తెలిపారు. వెట్టిచాకిరి నుంచి విముక్తి కలిగించిన మంత్రులు నారా లోకేష్, వాసంశెట్టి సుభాష్ లకు గల్ఫ్ బాధితురాలు దీప్తి, భర్త త్రిమూర్తు, కేశవపాడు మాజీ సర్పంచ్ మట్టపర్తి దుర్గాప్రసాద్, రాజేష్, ఆమె కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి సుభాష్ తమ కుటుంబానికి చేసిన మేలు ఈ జన్మలో మర్చిపోలేమని తమ ఆనందాన్ని మీడియా ప్రతినిధులతో పంచుకున్నారు.

రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యల పరిష్కారం

- ఎమ్మెల్యే సత్యానందరావు

కొత్తపేట, మేజర్ న్యూస్ : రెవెన్యూ సదస్సులను ఉపయోగించుకుని భూ సమస్యలు పరిష్కరించుకోవాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు.కొత్తపేట మండలం ఖండ్రిగ గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే సత్యానందరావు,ఆర్డీఓ శ్రీకర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ ప్రజల వద్దకు వచ్చి భూ సమస్యలు పరిష్కారం చేయడమే ప్రభుత్వం లక్ష్యమని కొనియాడారు.భూములు కబ్జా గాని,సమస్యలు గానీ ఎదురైతే వారిని పరిష్కరించడం కోసమే ఈ రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు.మన ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశారని అలాగే భూములను కాపాడుకోవడం కోసం ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ బిల్లు తీసుకురావడం జరిగిందన్నారు.దీంతో మన భూములకు రక్షణ కలుగుతుందని ఈ రెవెన్యూ సదస్సులను ఉపయోగించుకుని భూ సమస్యలు పరిష్కరించుకోవాలని సత్యానందరావు సూచించారు.ఈ కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్,రెడ్డి తాతాజీ,వాసంశెట్టి సత్యనారాయణ,గుబ్బల సత్తిపాండు,గూడెల వెంకటేశ్వరరావు ,దూనబోయిన అప్పారావు,కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు,చోడే రాజారమేష్ మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

డిసెంబర్ 21న కొవ్వూరులో మెగా జాబ్ మేళా

- నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ : జిల్లాలోని నిరుద్యోగ యువత కు ఉద్యోగ కల్పనలో భాగంగా మండల, నియోజక వర్గస్థాయిలో వికాస ఆద్వర్యంలో మెగా, మిని ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి ప్రశాంతి తెలియచేశారు. బుధవారం కలెక్టరేట్ లో డిసెంబర్ 21 న కొవ్వూరులో నిర్వహించనున్న జాబ్ మేళా కు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు.ఈసందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ, కొవ్వూరులో డిసెంబర్ 21శనివారం "వికాస" వారి అధ్వర్యంలో సుమారు 28 ఎంఎన్‌సీ కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్న మన్నారు.ఈ అవకాశాన్ని తూర్పుగోదావరి జిల్లా కు చెందిన నిరుద్యోగ యువతీ యువకులందరూ సద్వినియోగ పరుచుకోవాలని విజ్ఞప్తి చేశారు. టెక్నికల్ నాన్ టెక్నికల్, ఐటి, ఫార్మా, హెల్త్ కేర్, బ్యాంకింగ్ వంటి వివిధ రకాల విభాగాల్లో సుమారుగా 28 కంపెనీలలో 1,500 ఉద్యోగాలు ఇచ్చేందుకు ముందుకు రావడం జరిగిందన్నారు. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే దిశలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందని, అందుకోసం న్యాక్ సంస్థ లేదా నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ సంప్రదించండి.. మెరుగైన ఉపాధి అవకాశాలను పొందాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి తెలియ చేశారు. జిల్లా వ్యాప్తంగా మరిన్ని జాబ్ మేళా నిర్వహించనున్నట్లు, అందు కోసం నియోజక వర్గ స్థాయిలో ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులందరూ డిసెంబర్ 21వ తేదీ శనివారం "ఏ బి యన్ & పి ఆర్ ఆర్ కాలేజ్ ' అఫ్ సైన్స్ కొవ్వూరు నందు ఉదయం 9 గంటలకు సర్టిఫికేట్ జెరాక్స్ లతో హాజరు కావాలని కే లచ్చా రావు కోరారు. ఈ కార్యక్రమంలో వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. లచ్చరావు, మేనేజర్ శర్మ, బాబు పాల్గొన్నారు.

ఏజెన్సీలో రూ.30 కోట్లుతో రహదారులు అభివృద్ధి

- భూమి పూజతో పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

రంపచోడవరం, మేజర్ న్యూస్ : రంపచోడవరం నియోజకవర్గం పరిధిలో తొలి దశలో రూ.30 కోట్లుతో కొన్ని రోడ్లు అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి కొన్ని రోడ్లుకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతికొద్ది కాలంలోనే రంపచోడవరం నియోజకవర్గం పరిధిలో రోడ్లు, ఇతర సమస్యలపై అసెంబ్లీలో గళం విప్పి నియోజకవర్గం సమస్యలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు తయారు చేసి అందించడం జరిగిందన్నారు. అందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం రంపచోడవరం నియోజకవర్గానికి తొలి విడతగా రూ.30 కోట్లుతో ఏడు రోడ్లు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి తెలిపారు. అందులో భాగంగా మంగళవారం మారేడుమిల్లి మండలంలో మారేడుమిల్లి నుంచి చింతలపూడి రోడ్డు పూర్తిగా పాడై పోయిన 12.2 కిలోమీటర్ల రోడ్లు స్థానంలో రూ.8.55 కోట్ల తో కొత్తగా తారు రోడ్డు వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం మాజీ శాసనసభ్యులు చిన్నం బాబు రమేష్, తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయభాస్కర్, తెలుగుదేశం పార్టీ మారేడుమిల్లి మండల అధ్యక్షులు గురుకు శేషు కుమార్, పార్టీ ప్రధాన కార్యదర్శి పొడియం శ్రీను బాబు, టిడిపి మండల పార్టీ మాజీ అధ్యక్షులు బీశెట్టి అప్పాజీ, ఉపాధ్యక్షులు కర్రి సన్యాసి రెడ్డి, దూడ సువర్ణ కుమార్, రాష్ట్ర టిఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షులు పల్లాల రాజ్ కుమార్ రెడ్డి, మారేడుమిల్లి మండల జనసేన పార్టీ అధ్యక్షులు మల్లా దుర్గ ప్రసాద్ యూత్ ప్రెసిడెంట్ బీశెట్టి సత్య, కళ్యాణ్, బిజెపి నియోజకవర్గం నాయకులు భారతి, బుల్లి కొండలు దొర, రంపచోడవరం, మారేడుమిల్లి మండలాల బిజెపి పార్టీ అధ్యక్షులు రేవుల రామకృష్ణారెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి రామి రెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు, కూటమి పార్టీల పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని మిగతా ప్రాంతాలలోను ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి రోడ్డు పనులకు శంకుస్థాపన చేసారు.

వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా నల్లమిల్లి సత్యనారాయణ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక

రామచంద్రపురం, మేజర్ న్యూస్ : వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా పసలపూడి నీటి సంఘం అధ్యక్షుడు నల్లమిల్లి సత్యనారాయణ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రామచంద్రపురం తాసిల్దార్ కార్యాలయంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు ఎన్నిక జరగగా ఆర్డీవో డి.అఖిల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. రామచంద్రపురం నీటి సంఘం అధ్యక్షుడు బిక్కిన జగన్నాధరావు, వల్లూరి నీటి సంఘం అధ్యక్షులు కాకర్ల శ్రీమన్నారాయణ, చెల్లూరు నీటి సంఘం అధ్యక్షులు బలుసు వీర వెంకట సత్యనారాయణ మూర్తి, పులగుర్త నీటి సంఘం అధ్యక్షులు గొడితి వెంకటకృష్ణారావు లు ఎన్నికలో పాల్గొని నల్లమిల్లి సత్యనారాయణ రెడ్డి ని డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం రామచంద్రపురం నీటి సంఘం అధ్యక్షుడు బిక్కిన జగన్నాథరావును ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. వీరికి ఆర్వో అఖిల ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. డిసి చైర్మన్‌గా ఎన్నికైన సత్యనారాయణ రెడ్డికి రాయవరం మండలం కూటమి నేతలు అభినందనలు తెలిపారు.

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి అన్నదాన భవన నిర్మాణానికి మంగళవారం తాడేపల్లిగూడెంకు చెందిన ఊటుకూరి నాగ లవ కుమార్ , వారి కుటుంబ సభ్యులు రూ.50, 116లు విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు. డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధర్‌రావు స్వామివారి చిత్రపటం అందించారు.

డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్‌గా కరుటూరి

ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : గోపాలపురం డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్‌గా అంకంపాలెం గ్రామానికి చెందిన కరటూరి నరసింహారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రావులపాలెం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఎన్నికలు వద్దిపర్రు, ఆత్రేయపురం, మర్లపాలెం, అంకంపాలెం, రావులపాలెం, గోపాలపురం, జి.పెదపూడి నీటి సంఘాల అధ్యక్షులు పాల్గొని డిసిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా ఆర్డీవో శ్రీకర్ డిసిగా ఎన్నికైన నరసింహారావుకు ధ్రువపత్రాన్ని అందించారు. ఉపాధ్యక్షురాలుగా గోపాలపురానికి చెందిన మైకాపుల పుష్పావతిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా కృషి చేస్తామని చెప్పారు.

సహాయం చెయ్యడం కన్నా ప్రేరణ కలిగించడం మిన్న

- సమాజంలో అత్యంత విలువైన సంపద దివ్యాంగులు
- ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనం పొంది ఉన్నత లక్ష్యాలను సాధించాలి
- జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : అర్హులైన దివ్యంగులకి అన్ని విధాలుగా అండగా నిలిచి, ప్రభుత్వ పరంగా చేయూత నివ్వడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక శ్రీ గేదెల నూకరాజు కళ్యాణ మండపంలో జిల్లా స్థాయి అంతర్జాతీయ దివ్యాంగ దినోత్సవ కార్యక్రమం నిర్వహించి, దివ్యాంగుల కోసం ప్రత్యేక దృష్టి పెడుతున్న వివిధ రంగాల ప్రతినిధులను సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన దివ్యాంగులకి సామాజిక భద్రత పెన్షన్ కింద ఇంటి వద్దనే రూ.6 వేలు ప్రతినెలా అందిస్తున్నట్లు తెలిపారు. పూర్తిగా మంచనానికి పరిమితమైన వారికి ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి అర్హత కలిగిన వారికి రూ.15 వేలు పంపిణి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందుకోసం ప్రతి సోమవారం పిజిఆర్ఎస్‌లో అర్జీలను స్వీకరించడం జరుగుతోందని అన్నారు. మంచానికే పరిమితం అయిన దివ్యంగులే రానవసరం లేదని వారి తరపున కుటుంబ సభ్యులు హాజరై అర్జీ అందచేయ్యాలని తెలియ చేశారు. మెకనైజ్డ్ , బ్యాటరీ ట్రై సైకిల్, ట్రై సైకిల్, దివ్యాంగుల చైర్స్ కోసం ఎక్కువ విజ్ఞప్తి వస్తున్నాయనీ, అదే సమయంలో ఎన్ జీ వో సంస్థలు కూడా ఆయా ఉపకరణాలు సరఫరా చేసేందుకు ముందుకు వస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగుల పట్ల సానుభూతి, దయ చూపాల్సిన అవసరం లేదన్నారు. వారిలోని సృజనాత్మకత వెలికి తీసి ప్రోత్సహం అందించడం ముఖ్యం అని కలెక్టరు స్పష్టం చేశారు. జిల్లాలో దివ్యంగుల కోసం పనిచేస్తున్న జియాన్, పలుకు సంకల్పం పట్ట్, కన్నా ఫౌండేషన్ వంటి సంస్థలు భాగస్వామ్యం ఎంతో స్ఫూర్తి దాయకంగా నిలుస్తున్నాయనీ అభినందించారు.సిటీ శాసన సభ్యులు ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత 40 నుంచి 80 శాతం వరకు అంగవైకల్యం ఉన్నవారికి రు. 6వేలు, 80 శాతం ఉన్న వారికి రు. 15 వేల రూపాయల వరకు పెంచి పెన్షన్లను నేరుగా మీ ఇంటికి వచ్చి ప్రభుత్వం అందిస్తుందన్నారు. అర్హులైన వారందరికీ సదరన్ సర్టిఫికెట్స్ అందించడం జరుగుతుందన్నారు. అర్హులై ఉండి పెన్షన్ రాని వారికి వారి అర్హత ఆధారంగా పెన్షన్ అందించడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం జియాన్ సంస్థకు సంబంధించి దివ్యాంగులు ఆశ్రయాన్ని ఖాళీ చేయించడం అన్యాయం, దురదృష్టకరమన్నారు. జిల్లా కలెక్టర్ వారికి తగు న్యాయం చేయాలని కోరారు. భవిష్యత్తులో దివ్యాంగులకు ఇటువంటి సమస్యలు ఏర్పడిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో దివ్యాంగుల కొరకు మోటార్ బైక్ గాని, 3 చక్రాల మోటార్ వాహనాలు గాని వచ్చిన దాఖలాలు లేవని ప్రస్తుతం ప్రభుత్వం దానిమీద దృష్టి సారించడం జరిగిందన్నారు. మీలో ఒక్కడైనా విభిన్న ప్రతిభాప్రతి భావంతుల చైర్మన్ కోటేశ్వరరావు దివ్యంగుల అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తారని, ఆ దిశగా దివ్యాంగుల సమస్యలను పరిష్కరించడం కొరకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లే విధంగా కృషి చేస్తారన్నారు.రాజమహేంద్రవరంరూరల్ నియోజకవర్గం శాసనసభ్యులు గోరంట్ల బుచ్చియ్య చౌదరి మాట్లాడుతూ సమాజంలో విభిన్న ప్రతిభావంతులు తమ కాళ్ళ మీద నిలబడే విధంగా వారి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అమెరికా వంటి కొన్ని దేశాలలో దివ్యాంగులకు అత్యంత ప్రాధాన్యతను ఇవ్వటం జరుగుతుందన్నారు. కడప నుంచి వచ్చిన బధిరులు ఎంత చక్కగా నృత్యం చేశారో మనం చూడడం జరిగిందన్నారు. అర్హులైన దివ్యంగులకు గతంలో టిడ్కో గృహాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ పెంచి వారి అభివృద్ధికి ఆర్థిక సహకారాన్ని అందిస్తుందన్నారు. షాపులు కేటాయింపు, ఉద్యోగ కల్పనలో రిజర్వేషన్ల ప్రక్రియ వంటివి ప్రభుత్వం అందిస్తుందన్నారు. దివ్యాంగులకు అవకాశం ఇస్తే ఏదైనా సాధిస్తారని క్రికెట్ క్రీడలో విభిన్న ప్రతిభవంతుడు గోల్డ్ మెడల్ సాధించడమే అందుకు నిదర్శనం అని ఆయన పేర్కొన్నారు.

-ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు:

కన్నా ఫౌండేషన్ విద్యార్థి నృత్య ప్రదర్శన, ధవళేశ్వరం పలుకు సంకల్ప పాఠశాల నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో, ఇన్చార్జి ఎడి డిసేబులెడ్ ఏవివివి ఎస్ లక్ష్మణ రావు, సూపరింటెండెంట్ నాగభూషణం, ఇతర అధికారులు, దివ్యంగుల సంక్షేమం కోసం పనిచేస్తున్న వారిని ఘనంగా సత్కరించడం జరిగింది. సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పి కొండల రావు, రాయుడు సతీష్, కే.గోవింద్, ఎమ్..పాపిరెడ్డి, ఎమ్.. పోసికు మార్, కిరణ్,.రజనీ కుమార్, వై.వెంకటేశ్వర్లు , వై. ఉమా మహేశ్వరి, కె. భారత్ కుమార్, పి రాజు, జి.. కొండలరావు, దుర్గా మహేశ్వరి, పెదకాపు, ఈ.విశ్వనాథ్, ఏ.త్రిమూర్తి తదితరులను సన్మానించడం జరిగింది.

గ్రామాల సర్వతో ముఖాభివృద్ధికి పాటుపడాలి

ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : మండలంలోని గ్రామాల సర్వతో ముఖాభివృద్ధికి సర్పంచులు కార్యదర్శులు అంత పాటుపడాలని ఎంపీడీవో వెంకట్రామన్ హితవు పలికారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్పంచులు కార్యదర్శులతో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయనమాట్లాడుతూ పంచాయితీల అభివృద్ధి ప్రణాళికళను సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు సాధనకు అవసరమైన సామర్థ్యాలను అభివృద్ధి చేయడం,స్థానిక స్థాయిలో అభివృద్ధి ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్నెంట్ స్వరూప్ ఐసిడిఎస్ సూపర్వైజర్ కుమారి,ఈవోపీఆర్డి చంద్రశేఖర్, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వివాదాస్పద రొయ్యల చెరువులను పరిశీలించిన అధికారులు

ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : మండలంలోని పేరవరం పిరమిడ్ సమీపంలో జరుగుతున్న వివాదాస్పద రొయ్యల చెరువులను మంగళవారం జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా భూముల యజమానులతో మాట్లాడుతూ అనుమతులు లేకుండా చెరువులను తవ్వకూడదని సూచించారు. అలాగే అక్కడికి వచ్చిన పిరమిడ్ ప్రతినిధులతో మాట్లాడి వివరాల అడిగి తెలుసుకున్నారు. అనంతరం జేడీ మాట్లాడుతూ చెరువులు తవ్వాల్సివస్తే ముందస్తుగా అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, లేకుంటే చర్యలు తప్పవు అన్నారు. పర్యావరానికి హాని కలిగిస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ఆయన వెంట సీఐ విద్యాసాగర్, మండల మత్స్యశాఖ అధికారి డేవిడ్ తదితరులు ఉన్నారు.

ప్రజలు రెవిన్యూ సదస్సులను ఉపయోగించుకొని భూ సమస్య సమస్యలను పరిష్కరించుకోవాలి

- గొంగడి వెంకటరామిరెడ్డి

ఎటపాక, మేజర్ న్యూస్ : అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం, గుండాల గ్రామపంచాయతీలలో రెవిన్యూ సదస్సులను మంగళవారం నిర్వహించడం జరిగింది. ఈ రెవెన్యూ సదస్సులలో స్థానిక సర్పంచ్ బుద్ధా ఆదినారాయణ, గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా గుండాల ఎంపీటీసీ మాట్లాడుతూ ఈనెల ఆరవ తేదీ నుంచి డిసెంబర్ 8వ తేదీ వరకు 33 రోజులపాటు రెవిన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుంది అని, కావున ప్రజల భూములకు సంబంధించి, భూ కొలతల్లో తేడాలు, సర్వే నెంబర్లలో మార్పులు, వారసత్వం పేర్ల నమోదు, సరిహద్దు భూ సమస్య, భూవిస్తీర్ణంలో తేడాలు, రీసర్వే రికార్డుల నమోదు అయిన తప్పులు, కబ్జాలతో కోల్పోయిన భూములు, అసైన్డ్, చుక్కల భూముల పరాధీనం వంటి వాటిపై వినతలు తీసుకొని పరిష్కారం చూపుతారు అని, ఈ రెవెన్యూ సదస్సులను ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి, సర్పంచ్ బుద్ధ ఆదినారాయణ, సర్పంచ్ గుండి సీతాలక్ష్మి, ఉపసర్పంచులు, సార్రెడ్డి శ్రీనివాసరెడ్డి, తోట శశి కుమార్, తహసిల్దార్ కారం సుబ్బారావు, రెవిన్యూ ఇన్స్పెక్టర్ మరియు రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, మెడికల్ సిబ్బంది మరియు గ్రామ పంచాయతీల ప్రజలు పాల్గొన్నారు.

బలభద్రపురం రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ఆర్డిఓ

- గ్రామ సభలో తొమ్మిది అర్జీలు స్వీకరణ

బిక్కవోలు, మేజర్ న్యూస్ : ప్రజలకు, రైతులకి సంబంధించిన భూ సంబంధ అంశాలపై అర్జీలను స్వీకరించడం కోసం గ్రామ స్థాయిలో రెవిన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతోందని రాజమండ్రి రెవిన్యూ డివిజనల్ అధికారి ఆర్ కృష్ణ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం బిక్కవోలు మండలం బలభద్ర పురం గ్రామ రెవెన్యూ సదస్సునకు ముఖ్య అతిథిగాఆర్డీవో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఆర్ కృష్ణ నాయక్ మాట్లాడుతూ, ప్రజలకి సంబంధించిన భూ సంబంధ సమస్యలను క్షేత్ర స్థాయిలో తెలుసుకుని వాటినీ పరిష్కారం అయ్యే విధంగా రెవిన్యూ అధికారులు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగానే రెవిన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈరోజు గ్రామ రెవెన్యూ సదస్సు లో తొమ్మిది అర్జీలు రావడం జరిగిందన్నారు. భూ సంబంధ రికార్డులను పరిశీలించడం కోసం ప్రజలు గ్రామ రెవెన్యూ సదస్సు లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే పరిష్కారం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. సంబంధిత రికార్డులు పరిశీలించేందుకు ప్రజలకు, రైతులకి దిశా నిర్దేశం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ బి ఎస్ వి కృష్ణ, రెవిన్యూ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలను పరిశీలించిన టిడ్కో చైర్మన్

- అజయ్ కుమార్

సామర్లకోట, మేజర్ న్యూస్ : వైసిపి ప్రభుత్వం హయాంలో టిడ్కో గృహాలను నిర్లక్ష్యం చేశారని టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ అన్నారు. కాకినాడ జిల్లా సామర్లకోట శివారున ఉప్పు వారి సత్రం వద్ద వున్న టిడ్కో గ్రూప్ సముదాయాలను మంగళవారం ఆయన పరిశీలించారు. టిడ్కో గృహ సముదాయాలు వద్ద మౌలిక వసతులను మెరుగుపరిచి 100% లబ్ధిదారులు ఇళ్లలో చేరేలా చర్యలు తీసుకుంటామన్నారు. గృహ సముదాయాలు వద్ద వీధిలైట్లను, త్రాగునీటి సమస్య లను పరిష్కరించాలని లబ్ధిదారులు టిడ్కో చైర్మన్‌ను కోరాగా,సమస్యల పరిష్కారం చేసేలా అధికారులను ఆదేశించారు.అంతకు ముందు టిడ్కో గృహ సముదాయాలు పరిశీలనకు వచ్చిన చైర్మన్ అజయ్ కుమార్ ను కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి,పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు,కంటే జగదీష్ మోహన్,జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి పిట్టా జానకీ రామారావు పూలమాలలు వేసి స్వాగతం పలికారు.అనంతరం గృహ సముదాయాలను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్,గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్,అడబాల కుమారస్వామి,కౌన్సిలర్ బలుసు వాసు, మాజీ కౌన్సిలర్ లు , పితాని సూర్య నారాయణ, తాతపూడి కృష్ణ బాబు, దాట్ల శ్రీనివాస్,గొల్తి సత్యనారాయణ, కాళ్ల రవీంద్రబాబు,తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

ధనుర్మాసం సందర్భంగా నారాయణ యాగం నిర్వహించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మణి దంపతులు

జగ్గంపేట, మేజర్ న్యూస్ :జగ్గంపేట మండలం ఇర్రిపాక ఏలేరు నది తీరాన వేంచేసి ఉన్న భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి, శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయాల వద్ద ధనుర్మాసం పురస్కరించుకుని నారాయణ యాగం నిర్వహించిన జగ్గంపేట శాసనసభ్యులు, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ మణి దంపతులు శివ కేశవుల కటాక్షంతో ఈ ప్రాంతమంతా పాడిపంటలతో ధన ధాన్యాలతో రాబోయే సంక్రాంతి కనుల పండుగల నిర్వహించుకోవాలని ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని నారాయణ యాగం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే నెహ్రూ దంపతులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జగంపేట నియోజకవర్గంలో గల ప్రముఖులు పాల్గొని స్వామివారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తలు పాటించాలి

ఆత్రేయపురం,మేజర్న్యూస్ : మనం ఉండే పరిసరాల్లో అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తలు పాటించాలని రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్.విద్యాసాగర్ అన్నారు. మంగళవారం ర్యాలీ గ్రామంలో హైస్కూల్లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మత్తు పదార్థాలకు బానిస కాకూడదని, గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులు పట్ల జాగ్రత్తగా ఉండాలని, విద్యార్థులు మంచిగా నడుచుకోవాలని సూచించారు. మహిళకు రక్షణ కోసం సూచనలు ఇచ్చారు. విద్యార్థులకు ఏదైనా అసౌకర్యం కలిగినట్లయితే వెంటనే పోలీసు వారికి విషయం తెలిపితే వెంటనే చర్య తీసుకుంటామని హామీ ఇచ్చారు.

జమిలీ ఎన్నికలు అనర్థదాయకం

- పౌర సంక్షేమ సంఘం

కాకినాడ, మేజర్న్యూస్ : దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొన్నాళ్ళ వరకు అయిదేళ్లకోసారి జమిలీ ఎన్నికలు జరిగినా ప్రజాస్వామ్య విలువలు పూర్తిగా విఫలం కావడం వలన దేశ రాష్ట్ర స్థానిక ప్రభుత్వాలకు నిరంతర ప్రజాస్వామ్య ఎన్నికలు ఎప్పటికప్పుడు జరుపుకుంటున్న వ్యవస్థగా వుందని పౌర సంక్షేమ సంఘం పేర్కొంది. దేశ వ్యాప్తంగా ఒకేసారి అన్ని ఎన్నికలు పూర్తి చేయాలనుకోవడం అరంభంలో సాధ్యం అయినట్టుగా భవిష్యత్తు ఎన్నికలు కూడా అదే తీరుగా జరిగే అవకాశం వుండదన్నారు. మధ్యలో ప్రభుత్వం పడిపోయిన సందర్భంలో ఎన్నికలకు వెళ్ళాల్సి వస్తే మిగిలిన గడువుకు మాత్రమే ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. దేశవ్యాప్తంగా స్థానిక సంస్థల స్వపరిపాలన నిర్దిష్టంగా లేదని 1993 లో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా ఏడాదికి 4సార్లు గ్రామసభ తప్పనిసరి చేసినప్పటికీ అమలు చేయకుండా వాటి హక్కులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేతుల్లో పెట్టుకున్నాయని, ఎన్నికలు వున్నా లేకున్నా దేశవ్యాప్తంగా గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో ప్రజలతో వార్డు కమిటీలు, డివిజన్ కమిటీలు ఏర్పాటు చేసి ప్రజావాణి నిర్ణయాలు అజెండాగా అమలు చేయాల్సివుండగా వాటిని పూర్తిగా అమలు చేయకుండా 75 గణతంత్ర దినోత్సవాలు పూర్తిచేసుకున్న తరుణంలో స్థానిక ప్రభుత్వాల పాలన జమిలీ కారణంగా జంబలకిడిపంబ పంబలకిడిజంబగా మారే ధోరణి వుంటుందన్నారు. పార్టీఫిరాయింపులతో ఆర్థికనేరగాళ్ళతో అలవిమాలినతనంగా నిండిపోతున్న చట్ట సభలు జమిలీతో మరింత నేతిబీర అవుతాయని పౌర సంఘం కన్వీనర్, సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు పేర్కొన్నారు. లోక్ సభలో 542/233 రాజ్యసభలో 234/108 స్థానాలు కలిగిన కేంద్ర ప్రభుత్వం జమిలీకి తెరతీయడం క్రియాశీలక రాజకీయ శిరచ్ఛేదంగా వుందన్నారు. ప్రాంతీయ పార్టీల ఉనికి పూర్తిగా దెబ్బతినే ప్రమాదం వుంటుందన్నారు. దేశంలో ఏదో ఒక జాతీయ పార్టీకి కొమ్ము కాయాల్సిన దుస్థితి స్థానిక ప్రభుత్వాల వరకు ఈ చీడ దాపురిస్తుందన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి బీటలు వారే అప్రజాస్వామిక విధానాలు జమిలీ వ్యవస్థలో ఎదురవుతాయన్నారు. ప్రపంచంలో 40 కోట్ల జనాభా కలిగిన కెనడా, 10 కోట్ల జనాభా కలిగిన స్వీడన్ దేశాల్లో తప్ప మరెక్కడా జమిలీ నిర్వహణ లేదన్నారు. 142 కోట్ల జనాభా కలిగిన భారతదేశంలో నిరంతర ప్రజాస్వామ్య ప్రక్రియ నిర్వహణ లేకుంటే నియంతృత్వ పోకడలు ఏర్పడి వినాశనానికి దారి తీస్తాయన్నారు.

ఈ నెల 18 నుంచి 23 వరకు డిపార్ట్‌మెంటల్ పరీక్షలు - జేసీ రాహుల్ మీనా

కాకినాడ, మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ద్వారా వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఈ నెల 18 నుంచి 23 వరకు నిర్వహించే డిపార్ట్‌మెంటల్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ రాహుల్ మీనా.. రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్యం, విద్యుత్ ఇతర శాఖల అధికారులతో కలిసి ఏపీపీఎస్సీ డిపార్ట్మెంటల్ పరీక్షల ఏర్పాట్లపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 23 వరకు ఏపీపీఎస్సీ ద్వారా వివిధ ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు డిపార్ట్మెంటల్ పరీక్షల నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పరీక్షలకు సంబంధించి రెండు పరీక్షా కేంద్రాలు కాకినాడ పట్టణం ఎస్. అచ్చుతాపురం రైల్వే ట్రాక్ దగ్గర ఉన్న ఆయాన్ డిజిటల్, కాకినాడ రూరల్ మండలం రాయుడుపాలెం వద్దనున్న సాఫ్ట్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని జేసీ తెలిపారు. ఉదయం 10:00 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3:00 గంటల నుంచి ఐదు గంటల వరకు రెండు పూటలా డిస్క్రిప్టివ్, బహుళైచ్ఛిక పద్ధతుల్లో పరీక్ష ఉంటుందన్నారు. ఈ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను ఉదయం 8:30 నిమిషాల నుంచి 9:30 నిమిషాల వరకు పరీక్షా కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా మధ్యాహ్నం 1:30 నుంచి 2:30 వరకు పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు. పరీక్ష రాసి అభ్యర్థులు తమ వెంట హాల్ టికెట్ తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు తమ వెంట తీసుకురావాలని జేసీ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు నిర్వహించాలన్నారు. అదేవిధంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు, విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ సిబ్బంది అప్రమత్త వ్యవహరించాలన్నారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పరీక్షలు సజావుగా జరిగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జేసీ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు.సమావేశంలో ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారి కె.సురేష్, ఏఎస్ఓ, వై.వీ.ఎస్.నారాయణ, కాకినాడ ఆర్డీవో కార్యాలయం ఏవో ఠాగూర్, కాకినాడ అర్బన్ తహశీల్దార్ జితేంద్ర, కాకినాడ రూరల్ తహసీల్దార్ ఎస్.ఎల్.ఎన్.కుమారి, వైద్య ఆరోగ్యం, పోలీస్, విద్యుత్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భగవంతుని ప్రతిరూపం శ్రీమద్ భాగవతం - విజయ్ సింహాచార్

కాకినాడ,మేజర్న్యూస్ : శ్రీమద్ భాగవత గ్రంథ పఠనం ద్వారా భగవంతుని యొక్క మహిమాలతో పాటు భగవద్భక్తులు యొక్క విశేషాలను తెలుసుకోవడానికి ఎంతో వీలు ఉంటుందని రాజమండ్రి ఉత్తరాది మఠాధికారి సుధా పండితులు విజయ సింహాచార్ అన్నారు. స్థానిక రామారావు పేట లోనున్న సుసర్ల చలపతిరావు స్వగృహంలో కీర్తిశేషులు సుసర్ల శ్రీనివాసరావు రచించిన భాగవత హృదయ గంధంపై ఏడు రోజులపాటు నిర్వహించే ప్రవచన కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. తొలుత భాగవత హృదయ గ్రంథ పునఃముద్రణ ప్రచురణ కర్త గోపిక ప్రసాద్ భక్తులకు స్వాగతం పలికారు. అనంతరం భక్తులు ఉద్దేశించి విజయసింహాచార్ ప్రవచన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

శ్రీమద్ భాగవత సారోధార గ్రంధాన్ని రచించిన విష్ణు తీర్థుల యొక్క మహిమలను వివరిస్తూ భగవంతుని దర్శించుకున్న గొప్ప యతివరేణ్యులు అన్నారు. ఈ గ్రంథం దర్శించుకుంటేనే మనకు పుణ్యం లభిస్తుందని అటువంటిది అందులోని విషయాలను అవగాహన చేసుకోవడం ద్వారా భగవంతుని పట్ల భక్తి మరింతగా వృద్ధి అవుతుందన్నారు. ధనుర్మాస కాలంలో మార్గశిర మాసంలో ఇటువంటి సప్తాహ ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించడం సుసర్ల కుటుంబ సభ్యుల కు భగవంతుడు పూర్తి అనుగ్రహాన్ని ఆశీర్వచన పూర్వకంగా తప్పక అందిస్తారు అన్న భావనను ఆయన వ్యక్తం చేశారు. ప్రతిరోజు ఉదయం శ్రీ భాగవత సారోద్ధార సాయంత్రం శ్రీమద్ భాగవతం గ్రంధాలపై ప్రవచన ఉంటుందన్నారు. మార్గశిర మాసం ఎంతో పుణ్యప్రదమైందని సాక్షాత్ శ్రీకృష్ణ పరమాత్మ మాసానా మార్గ శీర్షోహం అన్న వాక్యాన్ని ప్రస్తావిస్తూ ఇంతటి పవిత్రమైన మాసంలో భగవంతుని విషయాలను శ్రవణం చేయడం పూర్వజన్మ సుకృతంగా విజయ సింహాచార్ ప్రస్తావించారు.

కార్యక్రమంలో డా.సుసర్ల వెంకట రమణ, సుసర్ల చలపతి, గోపికాప్రసాద్, కాకినాడ మధ్వసభ కమిటీ కార్యదర్శి కొపల్లి శేషగిరిరావు, సంయుక్త కార్యదర్శి డా.యాతగిరి పరశురామ్, కార్యవర్గ సభ్యులు రాచూరి శేషగిరిరావు, ఉదయగిరి శేషగిరిరావు, పాండ్రంగి రాధాకృష్ణ, మధ్వయువజన కమిటీ అధ్యక్షులు యాతగిరి మధ్వేష్, యాతగిరి పరుశురామాచార్, డా.భరతలక్ష్మి తోపాటు పలువురు పాల్గొన్నారు. వచ్చిన వారందరికీ తీర్థ ప్రసాదాలను ఏర్పాటు చేసామని సుసర్ల చలపతి తెలిపారు.

రాజమొమ్మంగిలో ఘనంగా పెన్షనర్స్ డే

రాజమొమ్మంగి, మేజర్ న్యూస్ : రాజమొమ్మంగిలో విశ్రాంతి ఉద్యోగులు పెన్షనర్స్ డే ఘనంగా నిర్వహించుకున్నారు. పెన్షనర్స్ కమిటీ అధ్యక్షులు కృష్ణవర్మ ఆధ్వర్యంలో స్థానిక విశాంతి ఉద్యోగులు భవనం వద్ద సీనియర్ పెన్షనర్స్ కుంజం అబ్బాయి దొర, కనిగిరి రాధాకృష్ణలను విశ్రాంతి ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కృష్ణ వర్మ మాట్లాడుతూ మనం చేసిన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం పెన్షన్ ఇవ్వడం జరుగుతుందని ఆ పెన్షన్ గౌరవంగా జీవించడానికే నన్నారు. అలనాడు నకార పెన్షనర్ హక్కుల కోసం కోర్టు ఆపిల్ వేయడం జరిగిందని చీఫ్ జస్టిస్ చంద్ర చూడ్ 1982 డిసెంబర్ 17న చారిత్రాత్మకమైన తీర్పునిచ్చారని వారిని స్మరించుకుంటూ ఈరోజు పెన్షనర్స్ డేజరుపుకోవడం జరిగిందని కృష్ణ వర్మ అన్నారు. రాజేశ్వరరావు, సుబ్బారావు, మరిడిరాజు, ఆర్ పి రాజు, వజ్ర పు అప్పారావు, సూరిబాబు,సత్యనారాయణ,నాగరాజు తదితరులు వున్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై శిక్షణా తరగతులు..

ఏలేశ్వరం, మేజర్ న్యూస్ : ఏలేశ్వరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రజాప్రతినిధులకు ప్రభుత్వ అధికారులకు రెండు రోజులపాటు శిక్షణా తరగతులు ప్రారంభించారు. బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో 12 గ్రామ పంచాయితీల సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బందితో ఎంపీడీవో సూర్యనారాయణ ప్రమాణం చేయించారు. ఈ శిక్షణా తరగతుల్లో పేదరిక నిర్మూలన, ఆరోగ్యకరమైన గ్రామం, చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్, గ్రామంలో మంచి నీరు, క్లీన్ అండ్ గ్రీన్ వంటి ముఖ్య అంశాలపై శిక్షణ ఇచ్చారు.

గిరిజనుల సంక్షేమం, వారి భవిష్యత్తు అభ్యున్నతి కొరకు ఎస్టి కమిషన్ కృషి చేస్తుంది

- ఎస్టీ గ్రామాల్లో మరుగుదొడ్లు, వీధిలైట్లు, డ్రైనేజీ, పెన్షన్లు, బర్రెల గ్రౌండ్ వంటి పలు సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు
- బాలుర ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం
- పౌరుల హక్కులు గురించి ఎస్సీ ఎస్టీ గ్రామాల్లో విధిగా అవగాహన కార్యక్రమాల్ని నిర్వహించాలి.
- రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వదిత్యా శంకర్ నాయక్

రాజమహేంద్రవరం,మేజర్న్యూస్ : గిరిజనుల సంక్షేమం, వారి భవిష్యత్తు అభ్యున్నతి కొరకు ఆంధ్రప్రదేశ్ ఎస్టి కమిషన్ కృషి చేస్తుందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వదిత్యా శంకర్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆర్అండ్బి అతిథి గృహంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వదిత్యా శంకర్ నాయక్ మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో రెండు రోజులు పర్యటనలో భాగంగా గిరిజన గ్రామాల్లోని ప్రజలను, పలు సంఘాలను కలిసి ప్రభుత్వం వారి సంక్షేమానికి అందిస్తున్న కార్యక్రమాలను తెలుసుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై అర్జీలను స్వీకరించి వాటిని పరిష్కరించే దిశగా జిల్లా ఉన్నత స్థాయి అధికారులతో చర్చించడం జరిగిందన్నారు. బొమ్మూరు బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి అక్కడ ఉన్న చిన్నచిన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించామన్నారు. కడియం, హేమగిరి గ్రామాల్లో పర్యటించిన సందర్భంలో ఎంతో కాలంగా ఈ గ్రామాల్లో నివసిస్తున్నారని, వారికి డ్రైనేజీ సౌకర్యం, అర్హులకు గృహ నిర్మాణాలు ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. మద్దూరు, వాడపల్లి గ్రామాల్లో త్రాగునీటి కుళాయిలు , ఇంటి పట్టా, ఇంటి స్థలాలు మంజూరు, బ్యాంకు రుణ సహాయం, వీధిలైట్లు, అర్హులైన వారికి పెన్షన్లు , డ్రైనేజీ వంటి పలు సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించడం జరిగిందన్నారు. మీనానగరంలో నివసిస్తున్న 50 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయని వీరు చేపలను పట్టుకునేందుకు వలలు, చెరువులను లీజుకు, ఇప్పించడంతోపాటు సబ్సిడీతో కూడిన బ్యాంకు రుణ సహాయాన్ని అందించాలని ఆయన అధికారులకు సూచించామన్నారు. ఆధార్, రేషన్ కార్డు, ఓటర్ కార్డు, చేపల వృత్తిని చేపట్టేందుకు ఫిషర్మెన్ కార్డు ఇప్పించాలనే అర్జీలు స్వీకరించడం జరిగిందన్నారు. ఇప్పటికీ అనేక గ్రామాల్లో మరుగుదొడ్లు వీధిలైట్లు, డ్రైనేజీ, పెన్షన్లు, బర్రెల గ్రౌండ్ వంటి పలు సమస్యలు ఉన్నాయని,వాటిని పరిష్కరించేదిశగాఅధికారులకు సూచించామన్నారు. జిల్లాలో 7 పోస్ట్ మెట్రిక్, రెండు ప్రీ మెట్రిక్ ఆశ్రమం పాఠశాలలు ఉన్నాయన్నారు. మరో రెండు పోస్ట్ పాఠశాలను మంజూరైనప్పటికీ వీటికి అద్దె భవనాలు దొరకకప్రారంభంకాలేదని,త్వరలో ప్రారంభించడం జరుగుతుందని పేర్కొన్నారు.బాలురు కొరకు ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వంధృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. గిరిజన యువత గంజాయి రవాణాలో దళారుల చేతిలో మోసపోయి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పౌరుల హక్కులు గురించి ఎస్సీ ఎస్టీ గ్రామాల్లోవిధిగాఅవగాహన కార్యక్రమాల్ని నిర్వహించాలన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా వచ్చిన పలు సమస్యలపై సమావేశాన్ని ఏర్పాటు చేసి 15 రోజుల్లోగా వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులకు సూచించడం జరిగిందన్నారు.తాళ్లపూడి మండలం తుపాకుల గూడెం గ్రామంలో సాగు చేసుకుంటున్న 6 ఎకరాల భూమి పై సాగు హక్కు కల్పించడం, గ్రామ పరిధిలో చెరువులలో చేపల పెంచేందుకు హక్కులు కల్పించడం, కొన్ని కుటుంబాలకు ఆధార్ కార్డు లేకపోవడం, ప్రభుత్వ పథకాలు వర్తింప చెయ్యడం లేదని అర్జీ ఇచ్చారు. తప్పకుండా సమస్య పరిష్కారానికి అధికారులను పంపి సర్వే చేపట్టి, తగిన విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గోపాలపురం మండలం బుచ్చంపేటలో అటవీ శాఖ స్థానిక, గిరిజన తెగలకు చెందిన వారు 86 హెక్టార్లలో ఇరువురికి 50 శాతం ప్రాతిపదికన జామాయిల్ మొక్కలు వేసి 15 సంవత్సరాలయ్యి మొక్కలు కటింగ్ దశకు చేరుకున్న అటవీ శాఖ అధికారులు మాకు రావలసిన వాటా జామాయిల్ మొక్కలు కటింగ్ చేయనివ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అర్జీ రావడం జరిగిందని, దీనిని అవసరం మేరకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తుందని ఆయన స్పష్టం చేశారు. పత్రిక సమావేశంలో ఎస్టీ సెల్ పట్టణ అధ్యక్షురాలు సాలా సావిత్రి, టిడిపి ఎస్సీ ప్రాంతీయ సమన్వయకర్త ఏ. చిన్న పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జాన్ రాజు

రాజమొమ్మంగి, మేజర్ న్యూస్ : మండలంలో 2025 జనవరి 8 వరకు నిర్వహించనున్న గ్రామ రెవెన్యూ సదస్సులను ప్రజల సద్వినియోగం చేసుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్, డిప్యూటీ కలెక్టర్ జాన్ రాజు అన్నారు. మంగళవారం మండలంలోని వాతంగి పంచాయతీ వోగిపాలెంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. రెవెన్యూ సదస్సుల ద్వారా భూ తదితరసమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయన్నారు. గ్రామానికి చెందిన పలు అర్జీలను తాహసిల్దార్ అల్లు సత్యనారాయణ స్వీకరించారు. మధ్యాహ్నంఓకుర్తి గ్రామంలో తహసిల్దార్ ఆధ్వరంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. అలానేకింద్ర పంచాయతీ అనంతగిరి, మంజువరప్పాడు గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. డిప్యూటీ తాహసిల్దార్, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ చెల్లయ్యమ్మ, గ్రామ సర్పంచులు భీమిరెడ్డి సుబ్బలక్ష్మి, భూసరి సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది గ్రామస్తులు ఉన్నారు.

ఎబిసిడబ్లూఓగా ఎ.వి.సూరిబాబు బాధ్యతలు స్వీకరణ

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం డివిజన్ అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ అధికారిగా ఎ.వి.సూరిబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ముందుగా కాకినాడ జిల్లా బిసి వెల్ఫేర్ అధికారిణిని మర్యాదపూర్వకంగా కలుసుకుని వచ్చి విధులలో చేరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎబిసిడబ్లూఓను కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ ఎన్.సతీష్‌కుమార్, హెచ్‌డ బ్లూఓలు విశాలాక్షి,శ్రీవల్లి, చాముండేశ్వరి, అబ్బులు, ఎం.శైలజ రాణి, కె.రాఘవమ్మ, సిబ్బంది రమేష్, తదితరులు మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందించినవారిలో ఉన్నారు.

పోలీస్‌స్టేషన్‌నుండి ప్రశ్నాపత్రాలు పంపిణి

- పరిశీలించిన డివైఇఓ ప్రభాకర శర్మ

పెద్దాపురం,మేజర్న్యూస్: జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 6 నుండి 10 వ తరగతి విద్యార్థులకు నిర్వహించే సమ్మేటివ్ అసెస్‌మెంట్ ప్రశ్నాపత్రాలను స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేయడం జరిగిందని, పెద్దాపురం డివైఇఓ ఈరంకి ప్రభాకర శర్మ తెలిపారు.

దీనిలో భాగంగా మంగళవారం పెద్దాపురం పోలీస్ స్టేషన్ నుండి పెద్దాపురం పట్టణం, మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ హైస్కూల్స్ హెచ్ఎంలకు ఈ ప్రశ్నా పత్రాలను పంపిణీ చేయు ప్రక్రియను డివైఇఓ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వి.మౌనిక, ఎఎస్సై వి.వి.రమణ, ఎంఇఓ వి.ఆర్.కె.చౌదరి, ఎంఇఓ కార్యాలయ సిబ్బంది ప్రకాష్, మూర్తి, సిఆర్‌పిలు, ప్రదానోపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ ఆశ్రమంలో ఘనంగా 108 యజ్ఞాలు

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :పెద్దాపురం మండలం గుడివాడలో శ్రీకృష్ణ ఆశ్రమ వార్షిక వేడుకలు మంగళవారం ఘనంగా ముగిసాయి. ఆశ్రమ గురువు గవరసాన గోపాలకృష్ణమూర్తి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన వేడుకలలో భాగంగా శోభయాత్రతో పాటు 108మంది దంపతులచే నిర్వహించిన 108 యజ్ఞాలు, యాగాలు, ప్రత్యేక పూజలు, నిర్వహించారు.

అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ సర్పంచ్ కనపర్తి సీమదొర, గున్నాబత్తుల సుబ్బరాజు, చవ్వాకుల అప్పారావు, జానకిరామ్, చవ్వాకుల వెంకటేశ్వర్లు, కనపర్తి బాబ్జీ, చవ్వాకుల వీరబాబు, శేఖర్, శ్రీధర్, రామస్వామి, మల్లిక్, పరిసర గ్రామాల భక్తులు ప్రజలు పాల్గొన్నారు.

యాంకర్ వాయిస్ ఘనంగా మురారి అమ్మవారి జాతర వేడుకలు వేలాదిగా తరలివచ్చిన భక్తులు

గండేపల్లి, మేజర్ న్యూస్ : భక్తుల పాలిట కల్పవల్లిగా, కోరిన కోర్కెలు తీర్చే వరాల తల్లిగా భక్తుల్లో విశేష ప్రాచుర్యం పొందిన గండేపల్లి మండలం మురారి తోటలోని దుర్గమ్మ తల్లి అమ్మవారి తిరునాళ్ళు వేడుకగా జరిగాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుండి తరలివచ్చిన బక్తులు బారులు తీరారు. గండేపల్లి మండలం మురారి గ్రామంలోని ఓ తోటలో వెలసినే ఇక్కడి అమ్మవారికి మార్గశిర మాసం పున్నమి వెళ్ళిన మూడో రోజున జాతరను ప్రారంభించడం ఎప్పటి నుండో ఆనవాయితీగా వస్తుంది. ఇందులో భాగంగా అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, రవికి అందజేసేందుకు మహిళలు క్యూ కట్టారు. సుదూర ప్రాంతాల నుండి బస్సులు, కార్లు, ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలపై వేలాదిమంది భక్తులు తరలిరావడంతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసిపోయింది. భక్తి శ్రద్ధలతో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. కుటుంబ సమేతంగా విచ్చేసి అక్కడి తోటలోనే వంటా వార్పులు పూర్తి చేసుకుని సాయంత్రం వరకూ పిల్లా పాపలతో సరదాగా గడిపారు. జాతర ఏర్పాట్లతో ఆ ప్రాంతమంతా సందడిగా కనిపించింది. హైవైకి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ అమ్మవారిని దర్శించుకునేందుకు గతంలో భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చేవారు. హైవేపై సైతం మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తేవి, అయితే ఎక్కడా ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు, పోలీసులు గట్ట చర్యలు చేపట్టారు.

జెఎన్టీయుకెలో పలువురు అధికారుల అంతర్గత బదిలీలు

కాకినాడ, మేజర్ న్యూస్ : జెఎన్‌టియుకె యూనివర్శిటీలో ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ. కె.వి.ఎస్.జి.మురళీకృష్ణ ఆదేశాల మేరకు పలువురు అధికారులను అంతర్గత బదిలీలు చేస్తూ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ. వి.రవీంద్రనాథ్ మంగళవారం ఉత్తుర్వులు జారీ చేయగా విసి కాన్ఫరెన్స్ హాలులో అధికారులకు ఇన్‌ఛార్జి ఉపకులపతి నియామక ఉత్తర్వులను అందజేశారు.

ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ & టెక్నాలజీ (ఐఎస్‌టి) ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డా.కె.రాము అడ్మిషన్స్ ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గాను, ఇప్పటివరకు అడ్మిషన్స్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించిన ప్రొ.ఏ.ఎం.ప్రసాద్ ఐఎస్‌టి ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గాను, స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతిగా విధులు నిర్వర్తిస్తున్న ప్రొ.ఎం.రమేష్ స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గాను, స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ & టెక్నాలజీ స్పెషల్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రొ.కె.పద్మప్రియ స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ & టెక్నాలజీ ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా నియమితులయ్యారు. అదేవిధంగా జెఎన్‌టియుకె ఓఎస్‌డి & యుసిఇకె సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొ.డి.కోటేశ్వరరావును బీటెక్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ (బిఓఎస్) ఛైర్మన్‌గాను, ఐఐఐపి&టి ఇన్‌ఛార్జి డైరెక్టర్ & యుసిఇకె ఈసిఈ విభాగం ప్రొఫెసర్ డా.బి.టి.కృష్ణను ఎంటెక్ వివిఎల్ఎస్ఐ ప్రోగ్రాం బోర్డ్ ఆఫ్ స్టడీస్ (బిఓఎస్) ఛైర్మన్‌గా నియమించారు.ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ. కె.వి.ఎస్.జి.మురళీకృష్ణ మాట్లాడుతూ ఇన్‌ఛార్జి డైరెక్టర్‌లుగాను, బిఓఎస్ ఛైర్మన్‌లుగా నియమితులైన అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి యూనివర్శిటీ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలన్నారు. యూనివర్శిటీలో అందరూ సమిష్టి కృషితో పనిచేస్తే ఎన్ఐఆర్ఎఫ్‌లో మెరుగైన ర్యాంకు సాధించవచ్చునన్నారు. పరిపాలనా సౌలభ్యం మేరకు ఇప్పటివరకు ఐఎస్‌టికు అనుబంధంగా ఉన్న స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ మరియు స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ & టెక్నాలజీలను డైరెక్టరేట్‌లుగా మార్చడం జరిగిందన్నారు. దీని ద్వారా అధికారులు, సిబ్బందికి పని ఒత్తిడి తగ్గడంతోపాటు మెరుగైన సేవలు అందించేందుకు వీలు కలుగుతుందన్నారు.అనంతరం ఇన్‌ఛార్జి డైరెక్టర్‌లుగా నియమితులైన ప్రొ.కె.రాము, ప్రొ.ఏ.ఎం.ప్రసాద్, ప్రొ.ఎం.రమేష్, బిఓఎస్ ఛైర్మన్‌లుగా నియమితులైన ప్రొ.డి.కోటేశ్వరరావు, ప్రొ.బి.టి.కృష్ణలను ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ.కెవిఎస్‌జి.మురళీకృష్ణ, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ.వి.రవీంద్రనాథ్, యూనివర్శిటీ అధికారులు, టీచింగ్ & నాన్ టీచింగ్ సిబ్బంది తదితరులు అభినందించారు.

పీఎంపీ కమిటీ అధ్యక్షులుగా వి.నాగేశ్వరరావు

- నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

అనపర్తి, మేజర్ న్యూస్ : మంగళవారం జరిగిన పిఎంపీల నూతన కమిటీ ఎన్నికల్లో పొలమూరు గ్రామానికి చెందిన వాసంశెట్టి నాగేశ్వరరావు అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. కమ్యూనిటీ పారామెడిక్స్& ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(ది పీఎంపీ అసోసియేషన్) అనపర్తి, బిక్కవోలు మండలాల నూతన కార్యవర్గ ఎన్నికలు మంగళవారం జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు అధ్యక్షతన ఎస్ఎన్ఆర్ ఫంక్షన్ హాల్ నందు నిర్వహించారు. నూతన కమిటీ కి అధ్యక్షులుగా వాసంశెట్టి నాగేశ్వరరావు,కార్యదర్శిగా డి సాయి రామారెడ్డి, కోశాధికారిగా నీలంశెట్టి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా సీ హెచ్ వి రామారావు, సహాయ కార్యదర్శి పీటీఎల్ నారాయణ, గౌరవ అధ్యక్షులు ఎన్ఎస్ చలం లను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జరిగిన వైద్య విజ్ఞాన అవగాహన సదస్సులో రాజమండ్రి కి చెందిన సత్య కిడ్నీ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ వైద్యనిపుణులు డాక్టర్ ఎన్ సత్యప్రసాద్ హాజరై మాట్లాడుతూ మూత్రాశయ వ్యాధుల గురించి, కిడ్నీ లో వచ్చే రాళ్లు గురించి పీఎంపీలు చేయు ప్రాథమిక వైద్యం గురించి తెలిపారు,ప్రోస్టేట్ సమస్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి దేవానందం, జిల్లా కోశాధికారి పి చిన్ని, రాయవరం మండల కన్వీనర్ ఎన్వీరమణ, కేఎస్ఎన్ మూర్తి,పీ బాలసుబ్రహ్మణ్యం, కే వెంకటరావు,బాబ్జీ, డిఎమ్వీ రాజు తదితరులు హాజరయ్యారు. అనంతరం డాక్టర్ సత్య ప్రసాద్ ను సభ్యులు సత్కరించారు.

జిల్లాలో ఇప్పటి వరకు 2.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

- రైతుల ఖాతాకు 488 కోట్లు జమ
- జిల్లాలో ఇప్పటి వరకు 94 శాతం పంటలు కోతలు పూర్తి
- జెసి చిన్న రాముడు

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : ప్రస్తుత 2024-25 ఖరీఫ్ సీజన్లో జిల్లాకు నిర్దేశించిన 2 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంలో 2 లక్షల 32 వేల ధాన్యం సేకరణ చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు మంగళవారం ఒక ప్రకటనలో తెలియచేసారు. ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా 221 ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. ఇప్పటికీ 29,101 మంది రైతుల నుంచి 2.32 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరణ చేసి, రూ.488 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేయడం జరిగిందని పేర్కొన్నారు. రైతుల నుంచి ధాన్యం సేకరణ చేసిన 48 గంటల్లో సొమ్ము జమ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ సాగు విస్తీర్ణంలో 94 శాతం పంటలు కోతలు పూర్తి అయినట్లు జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు తెలియ చేశారు.

ఎక్సైజ్ దాడులలో 2800 లీ.బెల్లపు ఊట ధ్వంసం

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం ఎక్సైజ్ సిబ్బంది, అసిస్టెంట్ కమీషనర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కాకినాడ, ఇఎస్‌టిఎఫ్ ఎస్‌హెచ్‌ఓ క్లస్టర్ రైడ్‌లో సిఐ కె.వి.వి.డి.అర్జునరావు ఆధ్వర్యంలో మంగళవారం పెద్దాపురం సర్కిల్ పరిధి లోని పెద్దాపురం మండలం లోని మర్లావ గ్రామంలో సారాయి తయారీకి సారాయి తయారీకి నిల్వ ఉంచిన సుమారు 600 లీ. బెల్లపు ఊట, కాండ్రకోట సారాయి తయారీకి నిల్వ ఉంచిన సుమారు 600 లీ. బెల్లపు ఊట, , కట్టమూరు గ్రామంలో సారాయి తయారీకి నిల్వ ఉంచిన సుమారు 1600 లీ. బెల్లపు ఊట, దాడులు నిర్వహించి సారాయి తయారీకి నిల్వ ఉంచిన సుమారు 2800 లీ. బెల్లపు ఊట ధ్వంసం చేయడం జరిగిందని, ఎక్సైజ్ సిఐ కె.వి.వి.డి.అర్జునరావు తెలిపారు. ఈ దాడులలో అసిస్టెంట్ కమీషనర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ లక్ష్మీ తులసి, సిబ్బంది, ఇఎస్‌టిఎఫ్ సిఐ జి.వెంకటలక్ష్మీ, ఇఎస్‌టిఎఫ్ సిబ్బంది, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది మరియు ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నట్లు ఎక్సైజ్ సిఐ తెలిపారు.

కాండ్రకోటలో శ్రీరంగనాయకులు గోదాదేవి 7వ కళ్యాణ వార్షికోత్సవాలు

పెద్దాపురంరూరల్,మేజర్న్యూస్: పెద్దాపురం మండలం, కాండ్రకోటలో ధనుర్మాసం పురస్కరించుకుని 30 రోజుల పాటు ప్రతీరోజు వేకువ జామునే స్వామి వారి పూజా కార్యక్రమాలు నిర్వహించి నగర సంకీర్తన బృందం ఆధ్వర్యంలో హరినామ సంకీర్తన గ్రామంలో నిర్వహించడం జరుగుతుందని, శ్రీరంగ నాయకులు, గోదాదేవి నగర సంకీర్తన బృందం సభ్యులు తాటికొండ వెంకటేశ్వరరావు, ఓబిలిశెట్టి నాగభూషణం, భగవద్గీత ప్రచార సేవా సమితి ఉపాధ్యక్షులు నేతి వీరభద్రరావు, గంటా రామస్వామిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు తెలుపుతూ భోగి పండుగ వరకు ఈ కార్యక్రమం ప్రతీరోజు నిర్వహించి, కళ్యాణం జరిగినపుడు 600 మంది స్త్రీలకు పసుపు కుంకుం, జాకెట్లు, ప్రసాదంతో కూడిన కిట్ ఉచితంగా అందజేయబడునని కమిటి సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఊట రాజుబాబు, ఊట నాగబాబు, వాడ్రేవు అన్నవరం, పంచాది రామకృష్ణ మాస్టార్, పోసిన రామకృష్ణ, జాజిమొగ్గల గొల్లబాబు, తిరుమలనీడి శ్రీను, మండపాక నూకరాజు, మార్నీడి వెంకటేశ్వర్లు, మహిళా భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణా తరగతులను పరిశీలించిన జడ్పి సిఇఓ

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్‌లకు, సచివాలయ సిబ్బందికి ఎంపిడిఓ డి.శ్రీలలిత అధ్యక్షతన నిర్వహిస్తున్న రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణా తరగతులను కాకినాడ జిల్లా పరిషత్ సిఇఓ వి.వి.వి.ఎస్.లక్ష్మణరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-26 కార్యాచరణ ప్రణాళిక, సుస్థిరమైన అభివృద్ధి, స్థిరమైన లక్ష్యాలపై రెండు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహించడం జరుగుతుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని, సిఇఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఇఓ & పిఆర్‌డి రమణ, ఎపిఎం సూర్యనారాయణ, వ్యవసాయాధికారి సంజయ్ కుమార్, ఎంఇఓ వి.ఆర్.కె.చౌదరి, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష తులసి పూజ

అంబాజీపేట, మేజర్ న్యూస్ : ధనుర్మాసంలో భాగంగా అంబాజీపేట పెద్దవీధిలో వేంచేసి ఉన్న శ్రీ సీతారామచంద్ర స్వామివారికి మంగళవారం లక్ష తులసి పూజ నిర్వహించారు. శ్రీరామచంద్రుని జన్మ నక్షత్రం పునర్వసు నక్షత్రం పురస్కరించుకొని శ్రీ సీతారామ చంద్రస్వామి వారికి వైఖానస ఆగమ విధానంలో పెదపూడి గోపాలచార్యులు బ్రహ్మత్వంలో, ఖండవిల్లి బదరీనారాయణాచార్యుల పర్యవేక్షణలో అంబాజీపేటకు చెందిన ప్రముఖ కొబ్బరి వ్యాపారులు యర్రాప్రగడ సూర్య ప్రకాష్ సోదరులుచే సీతారాములవారికి అభిషేకాలు, లక్ష తులసి పూజ, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం హోమాలు, పూర్ణాహుతి జరిపించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

గ్రూప్ టెంపుల్స్ ఆదాయం హుండీల లెక్కింపు

పెద్దాపురం, మేజర్ న్యూస్ : పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం లెక్కించగా, రూ.1,75,657/-లు ఆదాయం సమకూరినట్లు దేవస్థాన కార్య నిర్వాహణాధికారి ప్రసాద్ తెలిపారు. అలాగే శ్రీ విశ్వేశ్వర చంద్రశేఖర స్వామివార్ల హుండీ లెక్కించగా, రూ.2,39,570/-లు ఆదాయం సమకూరినట్లు ఇఓ తెలిపారు. ఈ హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని దేవదాయ శాఖ తనిఖీ అధికారి వడ్డి ఫణీంద్ర కుమార్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జిఓ సభ్యులు, మహిళా మండలి సభ్యులు దేవస్థాన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

అయెధ్యలో రూ.150 కోట్లతో ఆలయ నిర్మాణం - చల్లా శాస్త్రి



కాకినాడ,మేజర్‌న్యూస్ : అయోధ్య నగరంలో సుమారు ఐదు ఎకరాల విస్తీర్ణం నందు రూ.150 కోట్ల వ్యయంతో ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు అయోధ్య నివాసి శ్రీరామ భక్త చల్లా శ్రీనివాస శాస్త్రి చెప్పారు. శ్రీ బ్రాహ్మణ అభివృద్ధి సమాఖ్య సేవ సంఘం ఆధ్వర్యంలో స్థానిక గైగోల్పాడులో ఉన్న సాయిబాబా ధ్యాన మందిరం కమిటీ సహకారంతో ఆలయ ప్రాంగణంలో అయోధ్య రాములవారికి సమర్పించనున్న రజిత స్వర్ణ ధనుర్బాణాలను భక్తుల దర్శనార్థం ఏర్పాటు చేశారు. ఈ సంద ర్భంగా రాజమండ్రి ఉత్తరాది మఠాధికారి సుధా పండితులు విజయ సింహాచార్ దంపతులు ఈ ధనుర్బాణాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళ హారతులు చేశారు. విజయ్ సింహాచార్ మాట్లాడుతూ రాములవారు కోదండ ఆయుధాన్ని ధరించడం వెనక ఉన్న ఆంతర్యాన్ని వివరిస్తూ భక్తుల రక్షణార్థంభగవంతుడు అనేక ఆయుధాలను అవతారాలలో ధరించారని మనం గమనిస్తూ ఉంటామని, రామావతారంలో భక్తులను మరియు ఋషులను రక్షించడానికి కోదండపానిని ధరించారని చెప్పారు.చల్లా శ్రీనివాస శాస్త్రి మాట్లాడుతూ ఈ కొత్తగా నిర్మిస్తున్న ఆలయంలో రాములవారి వంశానికి చెందిన సూర్య మరియు చంద్ర వంశాల తాలూకు రాజులతో పాటు రాముల కాలంలో వున్న ఋషుల తాలూకు మొత్తం 450 విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.ఈనూతన ఆలయ నిర్మాణ శంఖుస్థాపనకు భారత ప్రధాని నరేంద్ర మోడీ వస్తున్నారని వివరించారు. వచ్చే నెల 21వ తేదిన ఈ ధనస్సుతోపాటు అయిదు బాణాలను కూడా అయోధ్య రాములవారికి సమర్పించనున్నట్లు ఆయన తెలిపారు. దేశంలో ఉన్న పుణ్యక్షేత్రాలతోపాటు ప్రసిద్ధ దేవాలయాలలో ఈ ధనుర్బాణాలకు ప్రత్యేక పూజలు చేసి ఆయా ప్రాంతాలలోని భక్తులు వీటిని దర్శించుకుకునే అవకాశం కల్పించామనా చెప్పారు.అయెధ్యబాల రామ మందిర నిర్మాణంలో కమిటీ విజ్ఞప్తి మేరకు అయిరు వెండి ఇటుకలను కానుకగా అందించగా వాటినే శంఖుస్థాపనకార్యక్రమంలో వినియెగించారని గుర్తుచేసారు.ధ్యాన మందిర కమిటీ అధ్యక్షులు మేక లక్ష్మణరావు మరియు శ్రీ బ్రాహ్మణ అభివృద్ధి సమాఖ్య సేవ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పసుమర్తి సత్యనారాయణమూర్తులు సంయుక్తంగా పండితుడు విజయసింహచార్ దంపతులను ఘనంగా సత్కరించగా అయోధ్యగురువులు చల్లా శ్రీనివాస శాస్త్రి ప్రత్యేక శాలువాతో విజయ్ సింహచార్‌ని సత్కరించి ధనుర్బాణాల నిర్మాణ విషయాలను మరియు అయోధ్యలో భక్తులసౌకర్యార్థం చేపట్టిన పలు విషయాలను వివరించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ అభివృద్ధి సమాఖ్య సేవా సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ యాతగిరి పరశురామ్, మాధ్వసభ కమిటీ కార్యదర్శి కోపెల్ల శేషగిరిరావు, కార్యవర్గ సభ్యులు రాచూరి శేషగిరిరావు, ఉదయగిరి శేషగిరిరావు, యాతగిరి మధ్వేష్,మారేమండ ఆనందరావు తోపాటు భారీసంఖ్యలో భక్తులు దర్శించుకున్న వారిలో ఉన్నారు.

సామర్లకోట పట్టణ మహిళా అధ్యక్షురాలుగా పాలిక కుసుమ

సామర్లకోట, మేజర్ న్యూస్ : వైయస్సార్సీపి సామర్లకోట పట్టణ మహిళా అధ్యక్షురాలుగా పాలిక కుసుమ నియమితులయ్యారు.ఈ మేరకు పెద్దాపురం నియోజకవర్గ ఇన్చార్జ్ దవులూరు దొరబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.పట్టణ మహిళా అధ్యక్షు రాలుగా ఎంపికైన కుసుమ ను సామర్లకోట మున్సిపల్ వైస్ చైర్మన్ ఉబా జాన్ మోజేష్, కౌన్సిలర్లు మర్రి శేషారావు వైఎస్ ఆర్ పార్టీ నాయకులు పాలికి చంటిబాబు తదితరులు అభినందించారు.

రాజవొమ్మంగిలో డ్రైనేజ్ పూడికతీత పనులు

రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : రాజవొమ్మంగిలో మంగళవారం డ్రైనేజ్ పూడిక తీత పనులు చేపట్టారు. గ్రామ సర్పంచ్ గొల్లపూడి రమణి ఆధ్వర్యంలో స్థానిక నూకాలమ్మ గుడి వీధిలో డ్రైనేజ్ పూడిక తీత పనులు మొదలు పెట్టారు. పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్త చెదారం వెలుకి తీసి దోమల నివారణకు క్లోరినైజేషన్ చేయడం జరుగుతుందని సర్పంచ్ రమణి అన్నారు. అలానే ఎప్పటికప్పుడు పారిశుద్య పనులు చేపడుతున్నా మన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్,గొల్లపూడి పెద్దిరాజు, మధు, బుజ్జి, యోహాన్ ఉన్నారు.

కాజు పరిశ్రమ కార్మికులకు న్యాయవాదుల సంఘీభావం

ఏలేశ్వరం,మేజర్‌న్యూస్ : చిన్నింపేట జీడిపిక్కల పరిశ్రమ తెరిపించి, కార్మికులందరూ తమ ఉపాధి కాపాడాలని కోరుతూ కార్మికులు 32వ రోజు పరిశ్రమ ముందు ధర్నా నిర్వహించడం జరిగింది.ఈ ధర్నా శిబిరానికి ఐలాజ్ రాష్ట్ర నాయకులు బుగత శివ, ఐలు జిల్లా కార్యదర్శి ఆకాశపు మల్లేశ్వరరావు హాజరై సంఘీభావం వ్యక్తం చేశారు .ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు న్యాయవాదులు సహకారం అందిస్తామన్నారు.

కార్మికులు ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని సూచించారు. ఫ్యాక్టరీ యాజమాన్యం కార్మికులను ఇలా అన్యాయంగా రోడ్డుపై పడవేసి వెళ్లిపోవడం సరికాదని, కార్మికులు కష్టించి పనిచేసి ఎంతో లాభాలు చేకూర్చాలని అప్పుడు ఆ కార్మికులకు ఎటువంటి లాభాల్లో వాటా ఇవ్వలేదని ఇప్పుడు నష్టం వస్తే ఎలా చెప్తారని వారు అన్నారు.ప్రభుత్వం అనుమతి ఇవ్వకుండా మూసివేసిన యాజమాన్యంపై చట్టం ప్రకారం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలనిఅన్నారు .పరిశ్రమను కాపాడి కార్మికులకు ఉపాధి ఇవ్వాలని అన్నారు. ఈకార్యక్రమంలో సిఐటియు జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యుడు రొంగల ఈశ్వరరావు,ఎ.వీరబాబు, కె.చక్రధర్, గోవిందు, ధర్మజీ, కాంత రావు, వీరబాబు, ఎస్.జయలక్ష్మి, టి.దేవి, పాపారత్నం, అన్నపూర్ణ, ఎం.లక్ష్మీదుర్గ, వై.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ధనుర్మాస ఉత్సవం

ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్: ధనుర్మాసం సందర్భంగా విలాస మండపంలో కొలువుతీరిన స్వామివారి ధనుర్మాస ఉత్సవం చూపరులకు కనువిందు చేసింది. ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఉదయం జరిగిన స్వామివారి తిరువీధి సేవ అనంతరం మండపంలో జరిగిన ఉత్సవాన్ని భక్తులు కనులారా తిలకించి తరించారు. అశ్వాలు గజలక్ష్మి ముందు నడుస్తుంటే తలక్క మోహనంపై కొలువుతీరిన స్వామి వారు గోదాదేవితో కలిసి క్షేత్ర పురవీదులలో ఊరేగారు. అనంతరం విలాస మండపంలో స్వామివారి పూజలు నిర్వహించి హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

పురాణవాస కాలనీలను పరిశీలించిన మానిటరింగ్ కమిటీ అడ్వైజర్ ముదిత్ కుమార్

జీలుగుమిల్లి, మేజర్ న్యూస్ : మండలంలోని పోలవరం నిర్వాసిత గ్రామమైన టేకురు పునరావాస కాలనీలో జాతీయ పునరావాస ప్యాకేజీ మానిటరింగ్ కమిటీ అడ్వైజర్ ముదిత్ కుమార్ సింగ్ పర్యటించారు.ఈ సందర్భంగా గ్రామంలోని నిర్వాసితులతో మాట్లాడివారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పునరావాసంలో ఇప్పటివరకు అందిన సౌకర్యాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్వసితుల సమస్యలను కేంద్రానికి నివేదించి మౌలిక వసతులకల్పనకు కృషి చేయన న్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పోలవరం ప్రాజెక్టు అథారిటీ చీఫ్ ఇంజనీర్ రాజేష్ కుమార్, డిప్యూటీ డైరెక్టర్ ఎం రవి, డిప్యూటీ కలెక్టర్ వెంకటరమణ నాయక్, ఆర్డీవో ఎంవి రమణ,జీలుగుమిల్లి తాసిల్దార్ స్లేవజోజి తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 49 మందికి ఉపాధి

ఏలూరు,మేజర్ న్యూస్ : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ ,జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త అధ్వర్యంలో ప్రభుత్వ డిఎల్ టీసి ఐటి.ఐ కళాశాల, ఏలూరులో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాకు 79 మంది యువత హాజరు అయ్యారు.

అందులో 49 మంది వివిధ కంపెనీలలో ఉపాధి పొందిన ట్లు స్థానిక డి.యల్.టి.సి సహాయ సంచాలకులు ఎస్.ఉగాది రవి తెలిపారు. ఈ జాబ్ మేళాలో కంపెనీల ప్రతి నిధులు పాల్గొనడం జరిగింది.ఈకార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి ప్లేస్ మెంట్ అధికారి ప్రవీణ్ ,నేషనల్ కెరీర్ గైడెన్స్ ప్రవీణ్ కృష్ణ,కోఆర్డినేటర్స్ శ్యామ్, సునిల్ , సురేష్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ ప్రియుడి ఇంటి ముందు యువతి నిరసన

- పెళ్లి చేసుకుని మోసం చేశాడని ఆవేదన

రావులపాలెం, మేజర్ న్యూస్ : ప్రేమించి పెళ్లి చేసుకున్న తరువాత ప్రియుడు మోసం చేశాడని, ఇంటికి వెళితే అత్తమామలు తాళి తెంపి బయటకు నెట్టి వేశారని, తనకు న్యాయం చేయాలని రావులపాలెం మండలం కొమరాజులంకకు చెందిన యామన ఝాన్సీ, కుటుంబ సభ్యులు ప్రియుడి ఇంటి ముందు నిరసన దీక్ష చేపట్టింది. బాధితురాలు తెలిపిన వివరాలు ప్రకారం కొమరాజులంకకు చెందిన గంధ్రోతు హరికృష్ణ తాను ఆరు నెలలుగా ప్రేమించుకున్నామని, పెళ్లి చేసుకుని ఇంటికి వెళ్లగా హరికృష్ణ తల్లిదండ్రులు సత్తిపండు, వెంకటలక్ష్మిలు తాళి తెంపి బయటకు నెట్టి వేసి దుర్భాషలాడి దాడి చేశారన్నారు. మనస్తాపంతో ఆత్మహత్య ప్రయత్నం చేసుకోవడంతో కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారన్నారు. తనను తన భర్త కాపురానికి తీసుకుని వెళ్లాలని ఎన్నిసార్లు చెప్పినా తీసుకుని వెళ్లడం లేదని, ఝాన్సీ కుటుంబ సభ్యులు, కుల పెద్దలు హరికృష్ణ ఇంటికి మంగళవారం వెళ్లి నిరసన దీక్ష చేపట్టారు. తనకు న్యాయం చేయాలని ఇంటి ముందుకు కూర్చుని ఆందోళన చేపట్టారు. ఉదయం నుంచి హరికృష్ణ ఇంటి వద్దే కూర్చున్నారు. వీరికి మద్దతుగా రాష్ట్ర గౌడ సంఘం వర్కింగ్ అధ్యక్షుడు మట్టా వీరబాబు, జై గౌడ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నంగేటి రంగారావులు కూర్చున్నారు. మట్లా వీరబాబు మాట్లాడుతూ ప్రేమించి పెళ్లి చేసుకుని మోసం చేయడం దారుణమన్నారు. యువతికి న్యాయం జరగాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విషయాన్ని దృష్టికి తీసుకుని వెళ్తామన్నారు. న్యాయం జరగక పోతే ఉద్యమం చేస్తామన్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై చంటి సిబ్బందితో అక్కడికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలో అవాంచనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తున్నారు.

పిఠాపురంలో... ఈనెల 21న మినీ జాబ్ మేళా..

పిఠాపురం, మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మరియు జిల్లా ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా లోని నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు పిఠాపురం గవర్నమెంట్ పాలిటెక్నిక్‌లో ఈ నెల 21 వ తేదీన మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి సంస్థ అధికారి శ్రీనివాస్ మరియు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం కొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ కంపనీలు (డెక్కన్ ఫైన్ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఇండియా, మెడ్ ప్లస్ ఫార్మసీ,
యాక్సిస్ బ్యాంక్, ఇన్నోవా సోర్స్) కంపెనీలు హాజరుకానున్నాయని తెలిపారు. ఈ కంపెనీలలో గల వివిధ ఉద్యోగాలలో పనిచేయడానికి టెన్త్, ఇంటర్ ఎనీ డిగ్రీ, డిబిఎం ఫార్మసీ పూర్తి చేసిన 19 నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సు గల వారు అర్హులన్నారు. " జాబ్ మేళా" కు హాజరయ్యే అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించడం ద్వారా సదరు ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి, తగిన అర్హతలు గల అభ్యర్థులు ముందుగా వెబ్ సైట్ నందు తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ చేసుకోవాలని, సదరు జాబ్ మేళా" కు హాజరయ్యేవారు రెజ్యూమ్ లతో పాటు ఆధార్, ఇతర సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో... ఈనెల 21 వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ వద్దకు రావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు "86399 51441," 99491 56583" నంబర్ల ను సంప్రదించాలనిసూచించారు.

జగ్గంపేటలో ఘనంగా పెన్షనర్ల దినోత్సవం

జగ్గంపేట, మేజర్ న్యూస్ : జగ్గంపేటలో పెన్షనర్ల దినోత్సవాన్ని స్థానిక పెన్షనర్ల సంఘ భవనంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట సిఐ వైఆర్కె శ్రీనివాసరావు, జగ్గంపేట ఎస్బిఐ మేనజర్ శ్రీనివాస్, జగ్గంపేట ట్రజరీ ఆఫీసర్ జహీరుద్దీన్, మండల విద్యాధికారి ఆర్.స్వామి విచ్చేసారు. పెన్షనర్లు పాలిట దైవం, పెన్షన్ అనేది బిక్షం కాదని, అదిహక్కు అని సుప్రీంకోర్టు ద్వారా తీర్పురావడానికి కృషి చేసిన డిఎస్ నకరా, ఎ చిత్రపటానికి ముఖ్యఅతిథిలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం 75 సంవత్సరాలు దాటిని పెన్షనర్లు డి.రామలింగేశ్వరరావు, కోనబాబురావు, ఎస్.ఆదినారాయణ, బి. హెచ్ విజయలక్ష్మి, డి.వెంకటేశ్వరరావును అతిధులు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సమావేశానికి విచ్చేసిన పెన్షనర్లుకు కంటి, దంతాలు, ఇతర వ్యాదులకు సంభందించిన పరీక్షలు ఉచితంగా చేసి మందలు పంపిణీ చేసారు. పెన్షనర్ల సంఘం అధ్యక్షులు తోలేటిఆఫీసర్ జహీరుద్దీన్, మండల విద్యాధికారి ఆర్.స్వామి విచ్చేసారు. పెన్షనర్లు పాలిట దైవం, పెన్షన్ అనేది బిక్షం కాదని, అదిహక్కు అని సుప్రీంకోర్టు ద్వారా తీర్పురావడానికి కృషి చేసిన డిఎస్ నకరా, చిత్రపటానికి ముఖ్యఅతిథిలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం 75 సంవత్సరాలు దాటిని పెన్షనర్లు డి.రామలింగేశ్వరరావు, కోనబాబురావు, ఎస్.ఆదినారాయణ, బి. హెచ్ విజయలక్ష్మి, డి.వెంకటేశ్వరరావును అతిధులు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సమావేశానికి విచ్చేసిన పెన్షనర్లుకు కంటి, దంతాలు, ఇతర వ్యాదులకు సంభందించిన పరీక్షలు ఉచితంగా చేసి మందలు పంపిణీ చేసారు. పెన్షనర్ల సంఘం అధ్యక్షులు తోలేటి సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులు మాట్లాడుతూ రిటైర్ అయిన వారికి పెన్షనర్ల సంఘం అందిస్తున్న సహకారాన్ని కొనియాడారు.ప్రతి మండలంలోను ఇదే విధంగా పెన్షనర్లు సంఘాలకు ఏర్పడితే రిటైర్ అయిన వారికి ఎంతో మేలు కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం నేతలు మల్లేశ్వరరావు, వెంకటశాస్త్రి, కోన బాబురావు, జోషి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- పిఠాపురం పట్టణ ఎస్సై వి.మణికుమార్

పిఠాపురం, మేజర్ న్యూస్ : సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వి. మణికుమార్ అన్నారు. పిఠాపురం స్థానిక బంగారమ్మ రావిచెట్టు సెంటర్ మరియు చిన్నమాంబ పార్కు వద్ద ప్రజలకు సైబర్ నేరాల పట్ల ఏ విధంగా అప్రమత్తంగా ఉండాలి అన్న అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సెల్ఫోన్ మరియు సోషల్ మీడియా వినియోగం పెరిగిన నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు అనేక రకాలుగా వలవిసురుతున్నారని, మన వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితులలో సోషల్ మీడియా వేదికలలో షేర్ చేయరాదని, వాటిని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు ఆర్థిక నేరాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. ఫోన్ల ద్వారా మెసేజ్లు, వివిధ రకాల వెబ్సైట్లో లింకులను పంపిస్తారని, అలాంటి వాటిని ఓపెన్ చేయకుండా తగు జాగ్రత్తలు వహించాలన్నారు. వివిధ రకాల బ్యాంకుల నుంచి మాట్లాడుతున్నాము వివరాలు చెప్పమంటారని, నేరుగా బ్యాంకు వారిని సంప్రదించి, బ్యాంకు ద్వారానే ద్వారానే లావాదేవీలు జరుపుకోవడం సురక్షితమన్నారు. లోన్లు వివిధ రకాల ఆఫర్ల పేరుతో వచ్చే మెసేజ్లు, ఫోన్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో పిఠాపురం పట్టణ పోలీసు సిబ్బంది, పురప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా భవానీ పూజ

అంబాజీపేట, మేజర్ న్యూస్ : చిరతపూడి శివారు చిట్టి చెరువుగట్టు వద్ద గురుభవానీలు దంగేటి సాయిబాబు, మాతా భవానీ మల్లేశ్వరి, మట్టపర్తి ఏసు, మట్టపర్తి ప్రసాద్, పప్పుల వీరబాబుల పర్యవేక్షణలో కేతా దొరబాబు గురుభవాని ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి 21 కలశాల పూజను ఘనంగా నిర్వహించారు. గణపతి హోమం, అమ్మవారికి కుంకుమార్చనపూజలు,పంచామృతాభిషేకాలు చేశారు. అంతకుముందు 21 కళశాలతో స్థానిక వనువులమ్మ, విజయ దుర్గమ్మ ఆలయాల వద్ద నుండి భవాణీల శరణుగోషతో కళలతో జలాలను తీసుకు వచ్చి సహస్ర నామాలతో అమ్మవారి కలశాల, కుంకుమార్చన జరిపించారు.

ఆలయ ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన నిప్పులగుండంలో భవానీలతో పాటు భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భవానీలు, అయ్యప్ప స్వాములు, గ్రామస్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీరించారు.

రెవెన్యు సదస్సులలో నేటి వరకూ స్వీకరించిన అర్జీలు 742

- పరిష్కారం చేసిన 95 అర్జీలు..
- జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : రెవిన్యూ సదస్సులలో స్వీకరించిన అర్జీలను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించి అర్జిదారులకు ధృవీకరి ంచాలని జిల్లా కలెక్టర్ పిప్రశాంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలియచేసారు. తూర్పు గోదావరి జిల్లాలో డిసెంబర్ 12 నుంచి జనవరి 8 వ తేదీ వరకు రెవిన్యూ సదస్సుల షెడ్యూల్ రూపొందించడం జరిగిందన్నారు. ఆమేరకు తహసీల్దార్లు ఆయా రెవిన్యూ సదస్సులు నిర్వహించే గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించడం, గ్రామ సభల షెడ్యూల్ ను పంచాయతి కార్యాలయం, గ్రామ సచివాలయం వద్ద ప్రదర్శించాలని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ 70 గ్రామ పంచాయతీల పరిధిలో రెవిన్యూ సదస్సులు నిర్వహించినట్లు తెలియ చేశారు. ఇప్పటి వరకు 742 అర్జీలను స్వీకరించడం జరిగిందని, వాటిలో 95 పరిష్కరించి నట్లు తెలిపారు.

కొవ్వూరు డివిజన్ పరిధిలో 348 అర్జీలు, రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో 394 అర్జీలు వచ్చినట్లు కలెక్టరు ప్రశాంతి పేర్కొన్నారు.అర్జీలు పరిష్కార నేపథ్యంలో ప్రభుత్వం టైం లైన్‌తో కూడిన మార్గదర్శకాలు జారీ చేయడం జరిగిందన్నారు.

ప్రతి అధికారి జవాబుదారీతనం కలిగి ఉండేలా అర్జీలను ఆన్లైన్‌లో నమోదు చేస్తున్నట్లు, ఇందు కోసం ప్రతి నియోజక వర్గంలో ఒక స్పెషల్ డిప్యూటి కలెక్టరును పర్యవేక్షణా అధికారిగా బాధ్యతలను అప్పగించినట్లు తెలిపారు.